




# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 21, 2026 | సంపుటి : 2 | సంచిక : 249 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## మెట్రో కోసం రైల్వే మంత్రి
# అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

### 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం

- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్20 :**
హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకి సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.



# ఒడిషాలో 47వేల
## కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

**భువనేశ్వర్,జూన్20 :**
ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు.

మిగతాద్ది 2 లో



## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావదదన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు

**హైదరాబాద్,జూన్20 :**
నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

2 లో




## నిరంజన్ కుటుంబానికి బండ్ల గణెళిశ్ అండ

- 5లక్షల సాయంగా చెక్కు అందచేత

**హన్మకొండ,జూన్20 :**
ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ బాలుడు నిరంజన్ కుటుంబానికి ప్రముఖ చిత్ర నిర్మాత బండ్ల గణెళిష్ 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సర్ ప్రక్రియతలో అప్రమత్తం కావాలి

» ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్త పడాలి » కార్యకర్తలకు మంత్రి తుమ్మల హితవు



**ఖమ్మం,జూన్20 :**
సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. సర్ కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

## ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

- ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు
- చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు
- ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్20 :**
తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.




మిగతాది 2లో



# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,జూన్20 :**
రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మిగతాద్ది 2 లో



2లో..

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

- రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

**హైదరాబాద్,జూన్20 :**
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

- ప్రస్తుత విధానంతో పంచాయితీల బలహీనం
- కేంద్రానికి లేఖ రశామన్న మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్20:**
వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్కపేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు.

మిగతాది 2లో



## నిరంజన్ కుటుంబానికి బండ్ల గణెశ్ అండ

మొదటి పేజీ తరువాయి
శనివారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి బండ్ల గణెశ్ వెళ్లారు. నిరంజన్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్‌ను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్ భక్తుడిగా.. ఆయన స్ఫూర్తితో నిరంజన్‌కు ఆర్థిక సాయం చేశాను. దైవసమానులైన పవన్ కల్యాణ్ పరామర్శతో నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. మేమందరం ఇలా ఉన్నామంటే పవన్ కల్యాణ్ దయతోనే. నా కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా. ఈ రోజు వచ్చి ఆర్థిక సాయం చేయాలనుకున్నాను. నారా భువనేశ్వరి పుట్టిన రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది. నిరంజన్ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడను' అని అన్నారు.

## ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

మొదటి పేజీ తరువాయి
శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

మొదటి పేజీ తరువాయి
కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

మొదటి పేజీ తరువాయి
శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్దిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

మొదటి పేజీ తరువాయి
ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు.

సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు
వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

మొదటి పేజీ తరువాయి
దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

## రైతు సంక్షేమానికి కూటమి సర్కార్ కృషి
## పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధరల కల్పన

**– అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిలప్రియ**

రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, మద్దతు ధర కల్పిస్తోందని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 42,981 మంది రైతులకు అన్నదాత సుఖీభవలో భాగంగా మొదటి విడతలో రూ.7000 చొప్పున ప్రభుత్వం రూ 29.10 కోట్లు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం అన్నదాత సుఖీభవ నిధుల జమ చెక్కును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ విజయ శేఖర్, ఏఓ కిషోర్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్, ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి పాల్గొన్నారు

## టిటిడికి 20 లక్షల విరాళం

తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టులకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్తలు వడ్లమూడి లలిత్‌కుమార్, యలమంచిలి కృష్ణారావు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షల విరాళం ప్రకటించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆ విరాళం డీడీలను అందజేశారు. మహాయజ్ఞంలా నిత్యం లక్షలాది మంది భక్తులకు అన్న ప్రసాదాల వితరణకు సహకారం అందించిన దాతలను ఆయన అభినందించారు.

## స్కూల్ టాపర్లకు నగదు ప్రోత్సాహకం
## పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పంపిణీ

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం నెల్లూరు పట్టాభిరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పాఠశాల విద్యార్థిని బీ జాహ్నవి 587 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినందుకు రూ.50 వేలు, అలాగే 95 శాతం కంటే అధిక మార్కులు సాధించినందుకు మరో రూ.50 వేలు కలిపి మొత్తం రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని బహుకరించారు.
మరో విద్యార్థి టీఎన్ మేఘశ్యామ్ 562 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలవగా రూ.20 వేలు, ఎస్కే షబ్రీన్ 560 మార్కులతో పాఠశాల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినందుకు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. వీటితో పాటు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు నందిని, ధరణి, సునయన, సుజిత, షామీర్, సల్మా, వెంకటేశ్వర్లకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ నగదు ప్రోత్సాహకాలను ఎంఈఓలు వసంతకుమారి, ఎన్ అంకయ్యల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ మోహనరామలింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి
## సైబరాబాద్ తరవాత రాజధాని నిర్మించే అవకాశం

**– మీడియాతో సిఎం చంద్రబాబు నాయుడు**

హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ, ఆధ్యాత్మిక నగరంగా అమరావతి నిర్మాణం చేస్తున్నామన్నారు. టెక్నాలజీని అనుసంధానించి ఓ అధునాతన రాజధానిని నిర్మిస్తున్నామని చెప్పారు. నాలెడ్జ్ హబ్‌గా ఈ నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. గతేడాది విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని.. ఈ ఏడాది యోగా డేను అమరావతిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమంపై జాతీయ మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి ఇంటికి యోగాను తీసుకెళ్లాలనేదే తమ లక్ష్యమని.. ఓ మిషన్ మోడ్‌లో యోగాను అందరికీ చేరువ చేస్తామన్నారు. సైబరాబాద్ నిర్మాణం తర్వాత అమరావతి రాజధాని నిర్మాణం చేసే అవకాశాన్ని భగవంతుడు తనకు ఇచ్చారని తెలిపారు. సైబరాబాద్, హైదరాబాద్.. తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతున్నాయని, అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఎదిగిందని చెప్పారు. యోగాతో బాబా రామ్‌దేవ్ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ చేరువయ్యారన్నారు. యోగాను ఇంటింటికీ తీసుకెళ్లేలా బాబా రామ్‌దేవ్‌తో కలిసి ఏపీ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. యోగా ప్రపంచానికి భారత్ ఇచ్చిన ఓ అమూల్యమైన బహుమతని.. ఇలాంటి యోగాతోనే మానసిక ఒత్తిడి దూరం చేసుకుని ఏకాగ్రత సాధించగలమని వెల్లడించారు. టెక్నాలజీ ఒక్కటే సంపద తెచ్చిపెట్టదన్నారు. భారత్‌కు ఉన్న అత్యంత అమూల్యమైన శక్తి ఆధ్యాత్మికత, సంస్కృతి అని తెలిపారు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ యువత ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి
చంద్రబాబు నాయుడు సూచించారు.

## గత ప్రభుత్వాల సంకెళ్ల నుంచి బెంగాల్‌కు విముక్తి

**– బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోడీ వ్యాఖ్య**

గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసి నప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

## కక్షసాధింపు కోసం ఆర్టీఐ దుర్వినియోగం

**– మదనపల్లి డిగ్రీకాలేజీ వ్యవహారంలో ఫిర్యాదు కొట్టివేత**
**– పదేపదే కావాలనే ఆర్టీఐ దరఖాస్తు చేసినట్లు కమిషన్ గుర్తింపు**

సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ప్రభుత్వ అధికారులను వేధించడానికి వినియోగిస్తే సహించబోమని తేల్చి చెప్పింది. పారదర్శకత, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు తీసుకొచ్చిన దీన్ని దుర్వినియోగం చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేసి పలువురిని ఇబ్బందులకు గురి చేయడంపై ఆగ్రహించింది. ఈ మేరకు ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దాఖలు చేసినట్లు విచారణలో వెల్లడైందని కమిషన్ తెలిపింది. ఇప్పటికే అతను కోరిన సమాచారాన్ని కళాశాల అధికారులు అందించినప్పటికీ, అదే అంశాలపై మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంపై అనవసర భారం మోపినట్లు కమిషన్ గుర్తించింది. ఈ సందర్భంగా కళాశాల అధికారులు అవసరమైన సమాచారాన్ని పూర్తిగా అందించారని, కమిషన్ గతంలో ఇచ్చిన ఆదేశాలను సక్రమంగా అమలు చేశారని నిర్ధారించింది. విచారణలో భాగంగా ఫిర్యాదుదారుడు 800కు పైగా పేజీల సమాచారాన్ని ఉచితంగా పొందిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. అయినప్పటికీ అదే సమాచారాన్ని పునరావృతంగా కోరుతూ అధికారులను ఇబ్బందులకు గురిచేసినట్లు పేర్కొంది. ముఖ్యంగా మహిళా కళాశాల సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలకు సంబంధించి ఫిర్యాదుదారుడిపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది. సంబంధిత కేసుల్లో కోర్టు శిక్ష కూడా విధించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఆధారాలు లేని ఆరోపణలను కమిషన్ తోసిపుచ్చింది. ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు తేలడంతో ఫిర్యాదుదారుడిపై బ్లాక్‌లిస్ట్ చర్యలు తీసుకుంటూ, భవిష్యత్తులో అతడి నుంచి వచ్చే ఆర్టీఐ దరఖాస్తులను స్వీకరించరాదని కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులనూ కమిషన్ ప్రస్తావించింది.కేసుపై పూర్తి విచారణ అనంతరం ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కొట్టివేస్తూ విచారణను ముగించినట్లు కమిషన్ వెల్లడించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 21, 2026

# తెలంగాణలో బిజెపి ప్రధాన రాజకీయ శక్తిగా నిలువబోతున్నదా!

గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ అనలిస్ట్

తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగి, రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.
ఇటీవలి లోక్‌సభ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో పెరిగిన ఓట్ల శాతం, సాధించిన విజయాల ఉత్సాహంతో పార్టీ శ్రేణులు సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి.
తెలంగాణలో బీజేపీ బలపడటానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, జాతీయ బీసీ మోర్చా అధ్యక్షుడు కె. లక్ష్మణ్, బండి సంజయ్ కుమార్ వంటి అగ్రనాయకులు కిందిస్థాయి వ్యూహాలను అమలు చేస్తున్నారు. నాయకులు చేస్తున్న ముఖ్య ప్రయత్నాలు మరియు వ్యూహాలు క్రింది విధంగా ఉన్నాయి:

## 1. ఆపరేషన్ ఆకర్ష్ & చేరికలు

**నాయకుల గుర్తింపు**
క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న నియోజకవర్గ స్థాయి నేతలను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ఇతర పార్టీల నుంచి చేరికలు**
బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుండి అసంతృప్త నేతలను బీజేపీలోకి చేర్చుకుంటున్నారు.
గెలుపు గుర్రాలకే టికెట్లు ముందస్తు సర్వేల ఆధారంగా క్షేత్రస్థాయిలో బలం ఉన్నవారికే భవిష్యత్తు ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తామని ప్రకటిస్తూ ఇతర పార్టీల బలమైన నేతలను ఆహ్వానిస్తున్నారు.

## 2. బూత్ స్థాయి బలోపేతం & క్యాడర్ శిక్షణ

**బూత్ లెవెల్ ఏజెంట్లు**
ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాలను పరిశీలించడానికి మరియు పార్టీ ఓట్లను రక్షించుకోవడానికి బూత్ లెవెల్ ఏజెంట్లను అప్రమత్తం చేస్తున్నారు.

**కార్యకర్తల శిక్షణ శిబిరాలు**
రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 875 కి పైగా మండలాల్లో పార్టీ సిద్ధాంతాలు, బూత్ మేనేజ్‌మెంట్ మరియు సోషల్ మీడియా వ్యూహాలపై కార్యకర్తలకు నివాస శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు.

**శక్తి కేంద్రాల యాక్టివేషన్**
క్లస్టర్ మరియు శక్తి కేంద్రాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించి ఓటర్లతో నిరంతర సంబంధాలు కలిగి ఉండేలా చూస్తున్నారు.

## 3. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం

**ఇంటింటికీ ప్రచారం**
ఉచిత బియ్యం పంపిణీ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.




**డబుల్ ఇంజన్ సర్కార్ నినాదం**
తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్ర నిధులతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం (డబుల్ ఇంజన్) ఉండటం అత్యవసరమని ప్రజలకు వివరిస్తున్నారు.

**నిధుల కేటాయింపుల గుర్తింపు**
కేంద్ర బడ్జెట్ ద్వారా తెలంగాణ రైల్వే, జాతీయ రహదారుల మౌలిక వసతులకు కేటాయించిన రికార్డు నిధులను ప్రజల్లో చర్చకు పెడుతున్నారు.

## 4. ప్రజా సమస్యలపై పోరాటాలు & GHMC ఎన్నికల ఫోకస్

**రైతు గోస -- బీజేపీ భరోసా**
వరి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలస్యాన్ని, రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఎండగడుతూ ఆందోళనలు చేపట్టారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ లపై పోరు**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం, నిరుద్యోగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ సిద్ధం చేశారు.

**గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల వ్యూహం**
రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా 'వికసిత్ తెలంగాణ - బీజేపీ సంకల్ప పత్రం' పేరిట ప్రత్యేక మేనిఫెస్టోలను విడుదల చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

## 5. సోషల్ ఇంజనీరింగ్ & ప్రాంతీయ ప్రాతినిధ్యం

**వెనుకబడిన వర్గాల ఏకీకరణ**
బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలలో పార్టీ పట్టును పెంచుకోవడానికి ప్రత్యేక మోర్చాల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నారు.

**ఢిల్లీ స్థాయిలో గుర్తింపు**
తెలంగాణలో రాజకీయ ప్రాధాన్యతను పెంచేందుకు కేంద్ర మంత్రిమండలిలో లేదా జాతీయ స్థాయి సంస్థల్లో రాష్ట్ర నేతలకు కీలక పదవులు కల్పించేలా జాతీయ నాయకత్వం ప్లాన్ చేస్తోంది.
ప్రత్యర్థుల సాంప్రదాయ రాజకీయాలకు అతీతంగా బిజెపి ఆలోచన,పని తీరు ఉంటుంది అని ఇప్పటికే రుజువయ్యింది.
బిజెపి,మోడీ వ్యతిరేక పార్టీల కుహనా ఆలోచనా రీతులకు భిన్నంగా బిజెపి ని తెలంగాణ లో నిలబెట్టడానికి నాయకత్వం కృషి చేస్తుంది.
ప్రస్తుతం బిజెపి ఎత్తుగడలు ప్రజలతో పాటు బిజెపి కార్యకర్తలకు కూడా అర్థం కాకుండా ఉన్నది.బిజెపి వేసే ప్రతి వెనకడుగు ముందుకు దూకడానికి అని ప్రత్యర్థులు కూడా అంగీకరిస్తున్నారు.

- **తెలంగాణలో బిజెపి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా లేదా మూడవ శక్తిగా ఎదుగుతుంది.. అనే నినాదం నుంచి ఇప్పుడు తెలంగాణలో బిజెపి ప్రధాన రాజకీయ శక్తి అనే వరకు బిజెపి పార్టీ ఎదిగింది**

ఏదేమైనా,తెలంగాణలో బిజెపి ని ప్రధాన రాజకీయ శక్తిగా నిలపడం కొరకు నాయకత్వం వ్యూహాలు రూపొందిస్తున్నదని అనిపిస్తున్నది.

# రాజీ మార్గమే రాజమార్గం
## లోక్ అదాలత్ లో కుదిరిన రాజీ

గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

- తండ్రి ,కొడుకు మధ్య కుదిరిన సయోధ్య
- ఆరేళ్లుగా సాగుతున్న భూమి వివాదం .
- న్యాయవాదుల చొరవతో లోక్ ఆదాలత్ లో పరిష్కారం

ఆరేళ్లుగా తండ్రి కొడుకుల మధ్య కోరుట్ల న్యాయస్థానం లో కొనసాగుతున్న భూ వివాదం ఎట్టకేలకు లోక్ అదాలత్ వేదికగా సమసిపోయింది.

- **తల్లిదండ్రుల పోషణ భారం, వైద్యఖర్చులు, బాగోగులకు చూసుకోవడమే కాకుండా తోడ బుట్టిన సోదరికి తండ్రి నుంచి పొందిన స్థిరాస్తి నుంచి 4 గుంటల స్థలం రిజిస్ట్రేషన్ చేయుటకు, రూ.6.50 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించడంతో తండ్రి కొడుకుల నడుమ నెలకొన్న ఆరేళ్ల పంచాయతీకి తెరపడింది.**

రాజీ మార్గంలో తండ్రి, కొడుకుల నడుమ సయోధ్య కుదర్చడంలో న్యాయవాదులు తీసుకున్న చొరవ పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.
పూర్వపరాలిలా ఉన్నాయి. మన్నెగూడం గ్రామానికి చెందిన ఆర్మూర్ భీమయ్యకు కొడుకు ఆర్మూర్ భీమయ్య, కూతురు లత ఉన్నారు.
తండ్రి మానాల భీమయ్య తన పేరిట ఉన్న 3 ఎకరాల 30 గుంటల భూమిని గత కొన్ని సంవత్సరాల క్రితం కొడుకు భీమయ్యకు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేశారు.
కాగా ఆ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తల్లిదండ్రుల పోషణలో భాగంగా నెలవారీ




పోషణ భత్యం, వైద్యఖర్చులు కొడుకు పెట్టుకోవాలి. కానీ కొంత కాలం తర్వాత ఆ ఒప్పందం ఉల్లంఘించడటంతో తండ్రి మానాల భీమయ్య ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ను రద్దు చేసి తన పేరిట మార్పిడి కోసం కోర్టును ఆశ్రయించాడు.
దాదాపు ఆరు సంవత్సరాలుగా O.S No: 112/2020 కేసు కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నడుస్తున్నది.

- **ఈ నెల 20న లోక్ అదాలత్ ఉన్న నేపథ్యంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె.పావని బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రాజీమార్గంలో కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని సూచించారు.**

ఈ క్రమంలో వాది అయిన మానాల భీమయ్య తరపున న్యాయవాది భీమనాతి రఘు, ప్రతివాది అయిన ఆర్మూర్ భీమయ్య తరపున **న్యాయవాది బోయిని సత్యనారాయణ** ప్రత్యేక చొరవ తీసుకుని తండ్రి, కొడుకుల మధ్య చర్చలు జరిపి వివాదాన్ని కొలిక్కి తెచ్చారు.

- **రాజీ ప్రకారం తల్లి దండ్రుల పోషణ కోసం నెలకు 8 వేలు భత్యం ఇవ్వడంతో పాటు ఆలనా, పాలన చూసుకోవాలి. వైద్యానికి సంబంధించి ఖర్చులు చెల్లించాలి. అదే విధంగా తోడబుట్టిన సోదరి లతకు రూ. 6.50 లక్షలు, తండ్రి నుంచి పొందిన భూమి నుంచి 4 గుంటల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి.**

ఈ నిబంధనలకు వాది, ప్రతివాదులు అంగీకరించి రాజీపడ్డారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ సందర్భంగా న్యాయమూర్తి సమక్షంలో ప్రతివాది భీమయ్య తన సోదరికి రూ.5,50 లక్షలు చెక్కు రూపంలో, రూ. లక్ష నగదు రూపంలో ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా న్యాయమూర్తి కె.పావని గారు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, సమస్యను శాంతి యుతంగా శాశ్వత పరిష్కారం చేసుకోవాలని సూచించారు.
తండ్రి, కొడుకుల నడుమ నెలకొన్ని వివాదాన్ని రాజీమార్గంలో పరిష్కరించేందుకు కృషి చేసిన న్యాయవాదులను పలువురు అభినందించారు.

- **లోక్ అదాలత్ కు వచ్చిన కక్షిదారులకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ తాగునీటి వసతిని కల్పించారు.**

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తోట ఆంజనేయులు, ఎ.జి.పి రాజేశ్ ఖన్నా, ఉమా, రమేష్ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# సంజయ్ అన్న ఆప్యాయపు పలకరింపు..

**జమ్మికుంట కౌన్సిలర్ చందన శంకర్ కుటుంబాన్ని స్వయంగా కలిసి అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 20**



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మికుంట పట్టణంలోని 10వ వార్డు నూతన కౌన్సిలర్ తూర్పాటి చందన--శంకర్ కుటుంబాన్ని స్వయంగా వారి నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, చిన్నారితో సైతం స్నేహపూర్వకంగా మాట్లాడి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తూర్పాటి చందన--శంకర్ దంపతులను ప్రత్యేకంగా అభినందించిన బండి సంజయ్, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. కష్టసమయంలోనూ భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా పెట్టుకుని ప్రజల మధ్య పనిచేసి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని కౌన్సిలర్‌గా ఎన్నిక కావడం అభినందనీయమని కొనియాడారు.ముఖ్యంగా నిండు గర్భంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజల మద్దతు సాధించి విజయం సాధించిన తూర్పాటి చందన ధైర్యసాహసాలను ప్రశంసించారు. ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత, పార్టీ పట్ల ఉన్న విశ్వాసం కారణంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు.భారతీయ జనతా పార్టీ సాధారణ కార్యకర్తలను సైతం గుర్తించి ప్రోత్సహించే పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని అన్నారు. రాబోయే రోజుల్లో చందన--శంకర్ దంపతులు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, తమ రాజకీయ ప్రస్థానంలో ఎలాంటి అవసరం వచ్చినా "ఈ సంజయ్ అన్న మీకు ఎప్పుడూ తోడుంటాడు" అని భరోసా కల్పించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ తమ ఇంటికి రావడం పట్ల తూర్పాటి చందన--శంకర్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల పట్ల ఆయన చూపుతున్న ఆప్యాయత, ఆదరణ తమకు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని తెలిపారు. ఆయన ఆశీస్సులు, ప్రోత్సాహం తమ ప్రజాసేవా కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ం

# పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలి

**కరపత్రం ప్రతినిధి మంథని జూన్ 20**



మంథని, జూన్ 20: పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలని ఎల్ ఆర్ ఏ ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం మంథని మండలం పోతారం గ్రామంలో ల్యాండ్ మార్క్ రీసన్ అగ్రి ప్రాజెక్టులో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంపొందించడం కోసం పశువుల పెంట, చెరువు మట్టి, నవధాన్యాలు సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు సాయిల్ హెల్త్ కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రాజశేఖర్, రాజు, సంతోష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి

**-యువత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండ గట్టాలి**
**-పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా**
**-మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

**కరపత్రం ప్రతినిధి అందోలు (జూన్ 20)**
రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో, ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమంలో లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం కోనుగోలు చేయకుండా చేతులు ఎత్తివేయడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రతి గింజ కొంటాం అని ప్రగల్భాలు పలికిన సిఎం రేవంత్ రెడ్డి ఆయన సహచర మంత్రి



వర్గం మాట దాట వేస్తున్నారు కేంద్ర ప్రభుత్వంను పరిగణ లోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నీ పంటలను సీలింగ్ లేకుండా కోనుగోలు చేయాలనీ డిమాండ్ చేశారు. కేసిర్ హయాంలో రైతు లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా ఎత్తివేయడం ఎమిటని ప్రశ్నించారు. రైతు బంధు డబ్బులు వేయడం లేదు రైతు వ్యతిరేక విధానాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అందొాలు నియోజక వర్గంలోని రైతాంగం, యువత ప్రభుత్వ వైఫల్యాలు ఎండ గట్టాలని పిలుపునిచ్చారు. రైతులకు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ సమావేశంలో మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, మాజీ ఎ ఎం సి చైర్మన్లు పి. నారాయణ , పల్లే సంజీవయ్య, మాజీ ఎంపీపీ రామగౌడ్, చంద్రయ్య, బి ఆర్ ఎస్ నాయకులు లింగా గౌడ్, పైతర సాయి కుమార్, వీర రెడ్డి, చాపల వెంకటేశం, మాచర్ల విజయ్ కుమార్, చౌకం పల్లి, శివ కుమార్, ఎ. శంకరయ్య, సుంకే రమేష్, వినోద్ కుమార్, నాగ రత్నం గౌడ్, బిర్ల, శంకర్, ప్రదీప్ గౌడ్, పేంద గోపాల్, రొయ్యల సత్యం, కరుణాకర్, దాసరి దుర్గయ్య, అల్మాయి పేట మొగులయ్య, రఫీక్, రమణ, ఇమ్రాన్ ఖాన్, మొగులయ్య, నర్సింలు, దర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి చేయూత అందించిన వ్యాళ్ల హరీష్ రెడ్డి..



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 20:**
పెద్దపల్లి జిల్లా రామగుండం నగరంలోని 23వ డివిజన్ ప్రగతి నగర్‌కు చెందిన బద్రి లక్ష్మి అనే నిరుపేద మహిళ ఇటీవల తన తల్లిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి వెంటనే స్పందించారు. విహెచ్ఆర్ టీం సభ్యులు సమాచారం అందించడంతో హరీష్ రెడ్డి నెల రోజుల పాటు సరిపడే నిత్యావసర సరుకులతో పాటు బియ్యం అందజేసి ఆర్థికంగా అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు విహెచ్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా తమకు సమాచారం అందించాలని బాధితురాలు బద్రి లక్ష్మికి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో బొబ్బిలి సతీష్, కంకల దేవేందర్, బూరుగు వంశీకృష్ణ, కదర్ల శ్రీధర్, శ్రీకర్, వినయ్, మనోజ్, అజయ్ నిజాం తదితరులు పాల్గొన్నారు. స్థానికులు వ్యాల్ల హరీష్ రెడ్డి సేవా కార్యక్రమాలను అభినందించారు.

# కోరా ,జాన్సన్ , ఎ ఎన్ సి స్కూల్స్ లో ఘనంగా ముందస్తు యోగా వేడుకలు




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
జూన్ 21 న నిర్వాహించె అంతర్జాతీయ యోగా డే ని నగరం లోని కోర జాన్సన్ పాటశాలలో ముందస్తుగా శనివారం ఉదయం నిర్వహించారు.ఈ సందర్బంగా విద్యార్థిని విద్యార్థులు యోగా ఆసనాలు వేసి,డ్రాయింగ్‌లు , ధ్యానం నిర్వహించి యోగా వల్ల కలిగే లాభాలని తెలియజేసారు. పాటశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, దర్శకులు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా హరికృష్ణ, సంతోష్ రెడ్డి మాట్లాడుతు యోగా చేయటం వల్ల పిల్లల్లో ఏకగ్రత పెరుగుతుందని మానసిక ఒత్తిడి తగ్గుతుందని చదువు పట్ల మక్కువ పెరుగుతుంధని ప్రతిరోజు యోగా చేయడం వల్ల విద్యార్థులు వివిధ రకాల రుగ్మతాల నుండి ధూరం అవ్వొచ్చని తల్లితండ్రులు ఉపాధ్యాయులు పిల్లలతో ధ్యానం కోసం సమయం కేటయించి పిల్లల భవితకి మార్గం కావాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు యాజమాన్యం పాల్గొన్నారు.

# వీణవంక పోలీస్ స్టేషన్ ఎదుట ఇసుక ట్రాక్టర్లపై ప్రత్యేక తనిఖీలు





**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూన్ 20:**




హుజురాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండలంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం వీణవంక పోలీస్ స్టేషన్ ఎదుట రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు సంబంధించిన అనుమతులు, రవాణా పత్రాలు, వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు, ప్రభుత్వ నిబంధనల అమలును పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రూరల్ సీఐ పులి వెంకట్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఇసుక రవాణా జరగాలని అన్నారు. అక్రమంగా ఇసుక తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఇసుక రవాణాలో పాల్గొనే వాహన యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా చట్ట నిబంధనలను పాటించాలని సూచించారు.అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా నియంత్రించేందుకు మండల వ్యాప్తంగా నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని, ఎటువంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణాపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో సీఐ, ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు, వాహన యజమానులు పాల్గొన్నారు. తనిఖీల నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాదారుల్లో ఆందోళన నెలకొంది.

# పైతాన్ కంప్యూటర్ శిక్షణపై ఉచిత సెమినార్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 20:**


పేస్ కంప్యూటర్ డైరెక్టర్ అడప వనిత శ్రీనివాస్ పటేల్

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన 11 గంటలకు పైతాన్ ఉచిత సెమినార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేస్ కంప్యూటర్స్ డైరెక్టర్ అడప వనిత శ్రీనివాస్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చేరాలనుకునేవారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇతర వివరాలకు 9866147444 సెల్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

# ఆర్జీ 1లో ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 20:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో స్థానిక గోదావరి కళా ప్రాంగణం, జీఎం కాలనీ గ్రౌండ్‌లో సామూహిక యోగా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న నేపథ్యంలో ఒక రోజు ముందుగానే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, విశిష్ట అతిథులుగా సుజయ్ ముజేందర్, క్వాలిటీ జనరల్ మేనేజర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను, అధికారుల సంఘం ప్రతినిధి పి శ్రీనివాస్ హాజరయి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు మొదట అందరి చేత యోగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, యోగా కేవలం ఒక వ్యాయామ విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి రోజూ కనీసం ఒక గంట సమయాన్ని యోగాభ్యాసానికి కేటాయించి దానిని



దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. అనంతరం సింగరేణి పాఠశాల, సరస్వతి శిశు మందిర్, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆకట్టుకునే యోగా ప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకులను అలరించారు. అలాగే సేవా సభ్యులు ప్రత్యేక యోగా విన్యాసాలు ప్రదర్శించి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఆలాగే ఆర్జీ-1 ఏరియాలోని జిడికే, 1,3, 2, 2ూఏ, 11 ఇంక్లైన్ ఓసి- 5, వివిధ డిపార్ట్మెంట్ మెంట్స్ లలో ఉద్యోగులచే సాముహిక యోగా కార్యక్రమములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఏరియా-1 పరిధిలోని అన్ని గనుల అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు, యోగా శిక్షకులు, సేవా



సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక యోగా సాధన చేశారు. యోగా శిక్షకుల మార్గదర్శకత్వంలో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.యోగా ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు, యోగా శిక్షకులు అతిథులు అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డివైపియం వేణు, అధికారులు మోహన్ రావు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, వీరారెడ్డి, వివిధ గనులు, శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సేవా సభ్యులు తదితరులు భారి ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ రీ-పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు..

– రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 20:**
నీట్ రీ-పరీక్ష నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సెక్షన్ 144) ప్రకారం నిషేధాజ్ఞలను అమలు చేస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు అమలులో ఉంటాయని, వాటిని ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. మంచిర్యాల జోన్‌లోని మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు,



అవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం నిషేధించబడిందని పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ కేంద్రాలను ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# మాజీ మంత్రి హరీష్ రావుపై సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తా: కాంగ్రెస్ నేత తిప్పారపు సంపత్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, జూన్ 20:**
మాజీ మంత్రి హరీష్ రావు వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలతో త్వరలోనే సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్ తెలిపారు. శనివారం హుజురాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.హరీష్ రావు తనపై రాజకీయ కక్షతో కేసులు పెడుతున్నారని, అయితే వాటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని, అందులో అప్పటి ఆర్థిక శాఖ మంత్రిగా హరీష్ రావు పాత్ర ఉందని ఆరోపించారు. కాగ్ నివేదికతో పాటు పీసీ ఘోష్ కమిషన్ నివేదికలోనూ అనేక అవకతవకలు ప్రస్తావనకు వచ్చాయని పేర్కొన్నారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో వందల కోట్ల రూపాయల వ్యయాలకు సంబంధించి సరైన రికార్డులు, బిల్లులు, ఆధారాలు లేవని కాగ్ నివేదిక వెల్లడించిందని




సంపత్ ఆరోపించారు. రూ.407 కోట్ల ఖర్చులకు సంబంధించి స్పష్టమైన లెక్కలు చూపలేకపోయారని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్య శాఖలో 56 శాతం ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడం కూడా ఆయన అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.తెలంగాణలో వైద్య రంగంపై జరిగిన ఖర్చు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉందని కాగ్ నివేదిక పేర్కొన్న నేపథ్యంలో, హరీష్ రావు తనను తాను "ట్రిపుల్ షూటర్"గా పేర్కొనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన విఫలమయ్యారని ఆరోపించారు.ఫార్మా సిటీ పేరుతో వేల కోట్ల రూపాయల విలువైన భూములను ఫార్మా కంపెనీలకు కేటాయించడంలో అవినీతి జరిగిందని, ఆ నిర్ణయాల వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటుండటంతో సంబంధిత కంపెనీల యజమానులు హరీష్ రావుపై ఒత్తిడి తెస్తున్నారని వ్యాఖ్యానించారు.తాను చేస్తున్న ఆరోపణలు నిరాధారమైతే ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని హరీష్ రావుకు సవాల్ విసిరారు. తన వద్ద ఉన్న ఆధారాలతో అన్ని విషయాలను ప్రజలకు వెల్లడిస్తానని తిప్పారపు సంపత్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీల అమలులో రైతులకు విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- పంటల కొనుగోళ్లలో చేతులెత్తేస్తున్న రేవంత్ సర్కార్
- హామీలు అమలు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదు
- రైతు, ప్రజా సంఘాల జేఏసీ నేత పోలాడి రామారావు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్:**
పాత విధానానికి స్వస్తి పలికి కేంద్ర కోటా మేరకే పంట కొనుగోలు చేస్తామని ప్రకటించి పంటల కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ చేతులెత్తేసి అన్నదాతలను వంచను గురిచేయడం దారుణమని రైతు, ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మండిపడ్డారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోళ్లపై పరిమితి విధించి మార్కెట్ యార్డు దయాదాక్షిణ్యాలకు వదిలేస్తే అన్నదాతలు ఆగమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని వడ్లు పండించినా అన్ని పంటలకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ కేవలం ఏడు రకాల సన్నాలనే కొంటామని, కేంద్రం నిర్దేశించిన కోటాకు మించి కొనలేమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి రైతులను దగా చేసిందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంటల కొనుగోళ్లపై బోనస్, నీటి సరఫరా, కరెంట్ సరఫరాలపై కోతలు విధించి రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరణించిన రైతు బీమాకు అర్హులైన 7,600 మంది రైతులకు రైతు బీమా అందించలేదన్నారు. ఇప్పటికే మూడు విడతల రైతు భరోసా నిధులు రూ.16,545 కోట్ల బకాయిలు పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ భరోసా డబ్బులతోపాటు పెండింగ్ బకాయిలు మొత్తం కలిపి 29,358 కోట్ల రూపాయలను 30న సీఎం రేవంత్ నిర్వహించే సభావేదిక ద్వారా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఏయే పంటల ఉత్పత్తులను మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుందో అవే పంటలకు మాత్రమే అంతే మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లించి అన్ని పంటలను కొనుగోలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడమేనని ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించక



తప్పదని హెచ్చరించారు. గత యాసంగి సీజన్లో రైతులు పండించిన ధాన్యపు కొనుగోళ్లలో కేంద్రం వాటా మూడవ వంతు మాత్రమే కాగా ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొంటున్న సమయంలోనే మార్కెట్లో ప్రైవేట్ వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండగా, ఇకమీదట అత్యధిక పంట ఉత్పత్తులను మార్కెట్లోనే తరలించాల్సి వస్తే ప్రైవేట్ వ్యాపారులు, దళారులు చెప్పిన ధరలకు రైతులు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలతోసహా బంగ్లాదేశ్, మలేషియా, శ్రీలంక, తదితర దేశాలకు 35 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం ఎగుమతి జరుగుతుందన్నారు. మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్న, పెసలు, కందులు, సోయాబిన్, తదితర పంటలు కొంటున్నట్లుగా, ఇదే తరహాలో మార్కెఫెడ్ ద్వారా వరిధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చి కేంద్ర అనుమతితో ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై డిమాండ్ల సాధనకు రైతు సమర భేరి సభ నిర్వహణలో ఆలస్యమైనా రైతులను చైతన్యవంతం చేసి పోరుబాట పట్టించడంలో, ప్రతిపక్షాలను మొద్దు నిద్ర నుంచి మేల్కొలిపి రైతు జేఏసీ కీలక పాత్ర పోషించిందన్నారు. ఇచ్చిన హామీలు అమలుపరిచే వరకు జేఏసీ తరపున పోరుబాట చేసి రైతులకు అండగా ఉంటామని పోలాడి రామారావు భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కన్నం లక్ష్మణ్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు కల్లెపెల్లి రాజేందర్, జంపాల నర్సయ్య, అండెం రమణారెడ్డి, కొత్తకొండ రవీందర్రావు, తదితరులు పాల్గొన్నారు.